క్లుప్తంగా

రూ. 1.9 లక్షలకు లడ్డూ వేలం



లడ్డూను దక్కించుకున్న భాస్కర్‌రెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, పోతారంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. లడ్డూ వేలం పాట నిర్వహించగా వంగ భాస్కర్‌రెడ్డి రూ. 1.9 లక్షలకు దక్కించుకున్నాడు. లడ్డూ దక్కించుకున్న భాస్కర్‌రెడ్డిని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అన్నోజిగూడలో...

పోచారం: అన్నోజిగూడలో శివ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. అత్యధికంగా సాయికుమార్ రూ. 50 వేలకు పాడుకుని లడ్డూ దక్కించుకున్నారు. లక్ష్మణ్ యాదవ్ రూ. 11,000కు పూలు, పండ్లు పాడుకున్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



కుక్కలకు టీకా వేస్తున్న వైద్యులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ అధికారులు, బ్లూ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని మండప నిర్వాహకుడిపై కేసు



పోలీసులు సీజ్ చేసిన డీజే బాక్సులు, వాహనం

ఘట్‌కేసర్: నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించిన గణేశ్ మండపం నిర్వాహకుడిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లింగస్వామి సమాచారం మేరకు... పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన తిరుపతి స్థానికంగా ఓ వినాయక మండపం ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి నిర్వహించిన నిమజ్జనం శోభాయాత్రలో అనుమతి లేకుండా డీజే వినియోగించడంతో డీజే బాక్సులు, వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు మండపం నిర్వాహకుడు తిరుపతితో పాటు డీజే ఆపరేటర్ ధీరజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



స్వీపర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: పట్టణానికి చెందిన స్వీపర్ లక్ష్మీ భర్త వెంకటయ్య అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. పేద కుటుంబం కావడంతో బాధితులు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి రమేశ్‌ను ఆశ్రయించారు. సమష్టి నిర్ణయం మేరకు టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవింద్‌రాజ్ చేతుల మీదుగా రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కీసర: కీసర మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగాలు పలువురు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో గెటిటెడ్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, చంద్రారెడ్డి ఎస్.ఎ. గణితంలో, భిక్షపతి ఎస్.ఏ తెలుగు, సంతోషమ్మ ఎస్‌జీటీ, శశిరేఖ ఎస్‌జీటీ, అనురాధ ఎస్‌జీటిలను, పీఆర్‌టీయూటీఎస్ సంఘం పక్షాన సన్మానించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డితోపాటు ఏఐఏఫ్‌టీఓ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాల్లో విధులకు...

వైద్యులు డుమ్మా!

ఆస్పత్రుల్లో సమయ పాలన పాటించని డాక్టర్లు, సిబ్బంది

- కొరవడిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ
- మేడ్చల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- అల్వాల్ పీహెచ్‌సీలో వెలుగులోకి వాస్తవాలు
- విధులకు గైర్హాజరైన డాక్టర్ శ్వేత సస్పెన్షన్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు, సెలవులు తీసుకోకుండానే పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో పని చేస్తున్న పలువురు మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది డుమ్మా కొడుతున్న తీరు రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ కొరవడినందునే సర్కారు ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో పేదలకు వైద్యం అందటం లేదనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌సహా అదనపు కలెక్టర్లు ఆకస్మికంగా క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నా పలువురు వైద్యులు, సిబ్బంది మొద్దు నిద్ర వదలకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో దాదాపు నెల రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మండల, డివిజనల్ రెవెన్యూ కార్యాలయాలను కలెక్టర్‌సహా అదనపు కలెక్టర్లు ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా ఆయా ప్రాంతాలకు వెళ్లిన తర్వాత సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో నెలకొన్న లోపాలు ఉన్నతాధికారులకు తెలసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అల్వాల్ పీహెచ్‌సీని గత నెల 26న కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతి, సెలవు తీసుకోకుండానే స్థానిక మెడికల్ ఆఫీసర్ శ్వేత విధులకు గైర్హాజరైన విషయం వెలుగు చూసింది. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేసి, తాత్కాలిక మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శ్రీకాంత్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారులు జిల్లాలో ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తున్నారనే విషయాలు తెలిసీ ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతున్న తీరును పరిశీలిస్తే... సంబంధిత శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- దవాఖానాల్లో ఏబీఏఎస్ అమల్లో ఉన్నా వైద్య సేవల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు నుంచి సర్కారు ఆస్పత్రుల్లో ఆధార్ బేస్ అటెండెన్స్ సిస్టమ్ (ఏబీఏఎస్) విధానాన్ని అమలు చేస్తున్నారు. అయినా పలువురు డాక్టర్లు, సిబ్బంది డుమ్మా కొడుతున్న తీరు జిల్లా వైద్య రోగ్యశాఖను అప్రతిష్ఠ పాలుచేస్తోంది.



పర్యవేక్షణ అంతంతే..

మేడ్చల్ జిల్లాలో ఒక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి (మల్కాజిగిరి)తోపాటు ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించక పోవటంతో.. రోగులు వైద్య పరీక్షలతోసహా ఇతర వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలో 24 గంటలు (రౌండ్‌ది క్లాక్) ఆస్పత్రులు 12 ఉండగా, ఇందులో నాలుగు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేక పోవటం, మరి కొన్నింటిలో ఆలస్యంగా విధులకు వస్తుండటం రోగులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

- సర్కారు దవాఖనల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు రోగులకు మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. దవాఖానాల్లో 35 మంది డాక్టరు పోస్టులతో సహా 27 పారా మెడికల్, 32 ల్యాబ్ టెక్నీషియన్లు, 109సబ్ స్టాఫ్, 130 నర్సు పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. జిల్లాలో 3 వేల మంది ఆశావర్కర్లు పని చేయాల్సి ఉండగా 340 మంది మాత్రమే ఉన్నారు.
- అప్ గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 10 పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఆస్పత్రుల్లో మంజూరు పోస్టులతోసహా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా పరమేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లోని గౌడం సంఘం కార్యలయంలో ఆ గ్రామ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఉప్పల్ సర్కిల్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిరామేశ్వర్ వ్యవహరించగా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పరమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వి.రమేశ్‌గౌడ్, కార్యదర్శిగా ఎం.రమేశ్‌గౌడ్, డైరెక్టర్లుగా లలితగౌడ్, పద్మగౌడ్, శంకర్‌గౌడ్, హేమంత్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సలహాదారులుగా గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, సభ్యులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, సత్తయ్యగౌడ్, కృష్ణగౌడ్, భాస్కర్‌గౌడ్, మహేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో ఎన్నికల అధికారి, ముఖ్య అతిథి

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



అధ్యాపకులకు సన్మానిస్తున్న సీఎంఆర్‌ఈసీ కళాశాల కార్యదర్శి

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరి జీవితంలో గురువు పాత్ర పూజ్యనీయమైనదని సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళ (భువనగిరి) కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సాంస్కతిక శాఖ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విలువైన జ్ఞానసంపద అని వారి అనుభవాన్ని వినియోగించుకొని బంగారు భవిషతును నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ రూప, డాక్టర్ స్రవంతి, డాక్టర్ పావనీ, కవిత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఈసీ కళాశాలలో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఈసీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ అండ్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, నగదు బహుమతులతో అందజేసి సన్మానించారు. కళాశాల కార్యదర్శి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, హెచ్ఓడీ కేవి రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చిత్రంలో మిస్ ఇండియా రష్మిక తదితరులు

యోగా.. మంచిదేగా!

- జీవన విధానంలో యోగా భాగం కావాలి
- మానసిక ప్రశాంతతతో పరిపూర్ణ ఆరోగ్యం
- ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్
- జాతీయ స్థాయి యోగా అవార్డుల పంపిణీ

శామీర్‌పేట్: నిత్యం బిజీగా ఉండే జీవితంలో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత ఆరోగ్యం కోసం యోగా ఎంతో అవసరమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అలంకృత రిసార్ట్స్‌లో బోధీ స్కూల్ ఆఫ్ యోగా జాతీయ స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ విప్ ముఖ్యఅథిగా పాల్గొన్నారు. ఢిల్లీ, కర్నాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన 200 మంది యోగా ప్రతిభావంతులకు పట్నం చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు, యువతతో పాటు ఉద్యోగస్తులు, ఐఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులు యోగాను కొనసాగిస్తూ ప్రశాంతంగా తమ విధులను నిర్వహిస్తున్నారని వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో యోగా భాగమన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ యోగా ప్రాధాన్యతను ప్రపంచానికి చాటారని గుర్తు చేశారు. కుల మతాలను, ప్రాంతాలకు అతీతంగా అవార్డు గ్రహీతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు యోగా ప్రాముఖ్యతను మరింత ప్రచారం చేసి మానవాలికి మేలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిస్ ఇండియా రష్మిక, ఆధ్యాత్మికవేత్త గౌరీ రొక్కం, సత్యవాణి, బోధియోగ స్కూల్ ఫౌండర్ అశోక్, సలహాదారు ధనుంజయ, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కొనుగోలు చేసిన ముస్లిం యువకుడు



కరీంపాషాకు లడ్డూ అందజేస్తున్న ప్రవీణ్‌రావు, వెంకటేశ్‌ముదిరాజ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని అంకుషాపూర్ ఛత్రపతి శివాజీ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండలంలో పూజలందుకున్న వినాయకుడి లడ్డూను ఓ ముస్లిం యువకుడు కొనుగోలు చేశాడు. శోభాయాత్రకు ముందు మండపంలో విశేష పూజలందుకున్న లడ్డూను వేలం వేయగా స్థానిక యువకుడు కరీం పాషా రూ. 20,116లు చెల్లించి సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, వెంకటేశ్‌ముదిరాజ్ కరీం పాషాకు లడ్డు అందజేయగా లోకిరెడ్డి, స్వామి వివేకానంద యూత్ సభ్యులు ఆకాశ్, శివముదిరాజ్, అర్జున్‌రెడ్డి, దినేశ్ ముదిరాజ, హర్షవర్ధన్, అభి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడు మృతి

ఘట్‌కేసర్: వినాయక పూజ ముగించుకొని ఇంటికి వెళ్తున్న పురోహితుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో చికిత్స పొందుతున్న పురోహితుడు మరణించాడు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోత్కూరి బండయ్య శాస్త్రి(45) ఈ నెల 3న రాత్రి ఎదులాబాద్‌లో వినాయక పూజ ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళుతుండగా స్వామి వివేకానంద విగ్రహం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వేగంగా, అజాగ్రత్తగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తల, కడుపుతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ప్రమాద స్థలానికి చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి భాస్కర్ శాస్త్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మల్కాజిగిరి: డిఫెన్స్ ఉద్యోగుల నుంచి మద్యం బాటిళ్లు సేకరించి విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కుషాయిగూడకు చెందిన వి.వీరాస్వాములు గత కొంత కాలంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నా డు. దీనిపై సమాచారం అందడంతో గురువారం రాత్రి మౌలాలి త్రిశూల్ బార్ వద్ద పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి వివిధ బ్రాండ్స్‌కు చెందిన 50 ఫుల్‌బాటిల్స్, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఉప్పల్: నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నించిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సూర్యానగర్ కాలనీకి చెందిన పద్మావతి(65) శుక్రవారం మధ్యాహ్నం ఒంటరిగా వెళుతుండగా ఆమెను వెంబడించిన అగంతకుడు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కునేందుకు యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు అతడిని పట్టుకునేందుకు యత్నించగా తప్పించుకుని పారిపోయాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూకు రూ.20 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు ఐదేళ్లుగా స్కాలర్‌షిప్ నిధులు విడుదలకావడం లేదు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు మంజురు కావాల్సినవి రూ.20 కోట్ల స్కాలర్‌షిప్‌లు నిధులు పెండింగ్ ఉన్నాయి. ఓయూలో ఇటీవల జరిగిన కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరైనా పెండింగ్ నిధుల ప్రస్తావన రాకపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఓయూ అంతర్గత నిధులు తగ్గడంతో భవిష్యత్‌లో హాస్టల్ మెస్‌ల నిర్వహణ, ఉద్యోగుల వేతనాలు, పెంచన్లకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని సిబ్బంది పేర్కొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం



ఘట్‌కేసర్‌లో బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ బీజేపీ నాయకులు శుక్రవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు పన్నుల భారాన్ని తగ్గించి పేదల పక్షపాతిగా నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు కిషన్, సురేశ్, మహేశ్, శ్రీకాంత్, కృష్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడానికి జీఎస్టీ స్లాబ్ రేట్లు తగ్గించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు రామతీర్థ, వీరేశం, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాధిక, సిద్ధిరాజ్, నరేశ్‌ముదిరాజ్, మధుగౌడ్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: పేద ప్రజలకు అండగా ఉండే నాయకులు ప్రధాని నరేంద్రమోదీ అని మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజహరినాథ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని వివేకనందా విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జీఎస్టీ భారీ తగ్గింపులతో సామాన్యుడికి నిత్యావసర వస్తువులపై పన్ను భారం తగ్గుతందన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, ప్రేమ్‌దాస్, కిషన్‌రావు, సుధాకర్‌రెడ్డి, మురళీధర్, హేమలతారెడ్డి పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు గణేశ్ మహా నిమజ్జనం

- 17 చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- ప్రతి చెరువు వద్ద 2 క్రేన్లు, గజ ఈతగాళ్లు, 10 మంది సిబ్బంది
- పోలీసు బందోబస్తు.. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గణేష్ మహా నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా, ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా 17 చెరువుల వద్ద అన్నీ వసతులను కల్పించింది. తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకున్న గణనాథుల మహా నిమజ్జనం పదవ రోజైన శనివారం కనుల పండుగలా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

- 17 చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2 వేల మంది పోలీసులతో బందోబస్తుసహా ప్రత్యేక అధికారుల నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.
- ప్రతీ చెరువు వద్ద రెండు క్రేన్లు, ఇద్దరు గజ ఈతగాళ్లు, విద్యుత్తు లైటింగ్, మంచినీటి వసతితోసహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజన్, విద్యుత్ సౌకర్యాలను కల్పించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద స్పెషల్ ఆఫీసర్లుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లకు బాధ్యతలను అప్పగించటంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

వైభవంగా ఓనం సంబురాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో శుక్రవారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తుల ధరించడంతో పాటు ఓనం పండగ, కేరళ ప్రత్యేక వంటకాలు చేసి వేడుకలు జరుపుకొన్నారు. అంతకుముందు టీచర్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ గోపాల్‌రెడ్డి, కార్యదర్శి వసంత లత, డీన్ వెంకట రమణయ్య, ప్రిన్సిపల్ శ్రీలేఖ, మేనేజర్ దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓనం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు